
# నేటి కొడుకులూ రేపటి తండ్రులే!

పాలకోడేటి కృష్ణమూర్తి




నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ హైద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది. జనమంతా బిలబిలమంటూ దిగిపోయారు. రాఘవయ్య గారు కూడా దిగారు. ఆయన వయస్సు అరవై ఏళ్ల పైమాటే. తెలుగు మాస్టారిగా ఉద్యోగం చేసి రిటైరయ్యారు. ముగ్గుబుట్టలా పండిపోయిన జుత్తు, విశాలమైన నుదురు, నుదుటిమీద ముడతలు, లోతుకుపోయిన బుగ్గలు. నన్ను చూడగానే ఆయన కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. ఆయనకి నమస్కరించి ఆయనతోబాటు దిగిన కొడుకు కోడలిని విష్ చేశా. వాళ్లని కారులో నేరుగు హాస్పిటల్‌కి తీసుకెళ్లారు.

శేఖర్ రాఘవయ్యగారి ఏకైక సంతానం. మేమంతా ఒకే కాలనీలో వుండేవాళ్లం. శేఖర్ ఇప్పుడు నేను పనిచేసే కంపెనీలో పనిచేసేవాడు. ఐదు సంవత్సరాల క్రితం పాలకొల్లు బ్రాంచి ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ కావడంతో వాళ్లు పాలకొల్లు వెళ్లిపోయారు. తరచుగా అనారోగ్యంతో బాధపడుతున్న రాఘవయ్య గారిని మంచి హాస్పటల్‌లో చూపించాలని హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఐదు సంవత్సరాల తరువాత వాళ్లని మళ్లీ ఇదే చూడ్డం.

ముందుగా క్యాజువాలిటీ వార్డులో నూట యాభై రూపాయలు చెల్లించి అడ్మిషన్ కార్డు తీసుకున్నాము. వెంటనే ఇరవై వేల రూపాయలు కట్టమని చెప్పడంతో శేఖర్ వాటిని కూడా చెల్లించాడు.

అడ్మిషన్ కార్డు, ఇరవైవేల రూపాయలు చెల్లించి తీసుకున్న రశీదు చూసిన తర్వాత రాఘవయ్య గారిని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి అనుమతించారు.

అన్ని పరీక్షలు చేసిన తరువాత కంగారుపడాల్సిందేమీ లేదని, ఓ వారం రోజులపాటు అబ్జర్వేషన్‌లో వుంచుతామన్నారు డాక్టర్లు. రాఘవయ్య గారి వైద్యానికి డబ్బు ఖర్చుపెట్టడం శేఖర్ భార్య మంజులకు ఇష్టం లేనట్లుంది. ఆమె ముభావంగా వుంది.

నేను వింటానన్న ధ్యాస కూడా లేకుండా –

''ఇటువంటి పరిస్థితి దాపురిస్తుందని నాకు ముందునుంచి అనుమానంగానే వుంది. ఎలాగోలా ఆయన్ని వదిలించుకోమని మీకు ఎన్నోసార్లు చెప్పాను. ఉన్నదంతా ఆయన వైద్యానికి ఖర్చుచేస్తే మన పిల్లల భవిష్యత్తు ఏం కావాలి? మీకు ఆలోచన ఏకోశానా లేదు'' అంది విసుగ్గా. శేఖర్ మాట్లాడలేదు. ఆ భార్యాభర్తల తీరు, వారి ప్రవర్తన నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. అయినా మాట్లాడకుండా ఊరుకున్నాను.

మూడు రోజుల తర్వాత రాఘవయ్య గారిని ఐసియులోంచి జనరల్ వార్డులోకి తీసుకొచ్చారు. ఆ సమయంలో శేఖర్, మంజుల ఏదో పనిమీద బయటకి వెళ్లారు. రాఘవయ్య గారు బాగా నీరసంగా వున్నారు. ఆయన దేనిగురించో బాధపడుతున్నట్లుంది. ఆయన కనుకొలుకుల్లో నీళ్లు నిండాయి.

''రాఘవయ్యగారూ, మీరు ధైర్యంగా వుండాలి. ఆలోచిస్తున్నకొద్దీ సమస్యలు, బాధలు పెరుగుతాయి తప్ప తరగవు. అన్నింటికీ ఆ భగవంతుడున్నాడు. మీరు త్వరలోనే కోలుకుంటారు'' సాంత్వనగా పలికాను.

''మనిషి జీవితంలో ఎన్నో ఆలోచిస్తాడు. ఎన్నో కలలు కంటాడు. పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ పిల్లలు అనే బాంధవ్యం అతడిని కట్టిపడేస్తుంది. వార్ధక్యంలో తనకి ఆసరాగా ఉంటారని ఆశించిన పిల్లలు అలా వుండనప్పుడు తన జీవితంలోని జ్ఞాపకాలన్నింటినీ చంపేసుకోవాల్సి వుంటుంది. తన కడుపు మాడ్చుకుని పిల్లల్ని చదివించి పెద్దచేసి పెళ్లిళ్లు పేరంటాలు చేసి వాళ్లు ఒక ఇంటివారయ్యారన్న సంతోషం ఎంతకాలం వుంటుందో చెప్పలేము. ఒక్కోసారి వాటినన్నిటిని మరచిపోయి ఎండిన మోడులా జీవించాల్సి వుంటుంది. చస్తూ బ్రతుకుతూ క్షణమొక యుగంలా గడపాల్సి వస్తుంది'' అన్నారు రాఘవయ్యగారు నావైపు విచారవదనంతో చూస్తూ. కొద్ది క్షణాల మౌనం తర్వాత మళ్లీ ఆయనే అన్నారు.

''సంస్కారం తెలియని కొడుకు కోడలి ఇంట్లో ఆత్మగౌరవాన్ని చంపుకుని ఎలా ఉండగలననుకుందో... నా భార్య నాకన్నా ముందుగానే వెళ్లిపోయింది. అదృష్టవంతురాలు. ఆఖరి శ్వాస కొడుకింట్లో తీసుకోవడంకన్నా కన్నవారికి అదృష్టమేముంటుంది. కాని నాకు చావు ఎక్కడ రాసిపెట్టి వుందో తెలియడం లేదు. మా అబ్బాయి వ్యవహారం చూస్తున్నావుగా?''

ఇంతలో డాక్టరు గారు వచ్చి ''ఎలా వుంది రాఘవయ్యగారూ'' అని పలకరించారు. అప్పుడే బయటికి వెళ్లిన శేఖర్, మంజుల రావడంతో వాళ్లకేసి చూస్తూ – ''చూడు మిస్టర్ శేఖర్! మీ నాన్నగారి ఆరోగ్యం సరిలేదు. ఇటువంటి సమయంలోనే ఆయనకి తనవాళ్ల అవసరం వుంది. మీరు ఎక్కడికి తిరక్కుండా ఆయన దగ్గరే వుండండి'' అని చెప్పి వెళ్లిపోయారు.

''ఈయన ఇంట్లోనే కాదు. హాస్పటల్‌లోనూ పెద్ద తలనొప్పిగా తయారయ్యారు. అందరిచేత మాటలు పడాల్సి వస్తోంది'' విసుగ్గా అంది మంజుల.

''చూడు మంజులా... నాన్నగారికి ముసలితనం వచ్చేసింది. ఇంకా ఎంతోకాలం బతకరు. నువ్వు ఓపిక పట్టు. అనవసరంగా రభస చేయకు'' అంటూ ధైర్యం చాలకపోయినా భార్యకి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు శేఖర్. ఆ సమయంలో మంజుల కళ్లు కోపంతో ఎర్రబడ్డాయి. కొడుకు కోడలి మాటలు వింటున్న రాఘవయ్యగారి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నావంక దిగులుగా చూశారు. నేనూ ఏమీ అనలేకపోయాను.

రాత్రి. సమయం పన్నెండు గంటలు దాటింది. వార్డులో అంతా నిశ్శబ్దంగా వుంది. వేగంగా వెలువడుతున్న రాఘవయ్యగారి ఊపిరి మాత్రమే వినబడుతోంది. వార్డులో రోగులు చాలా తక్కువగా వున్నారు. కొందరు గాఢనిద్రలో వున్నారు. మరికొందరు నిద్రకి ఉపక్రమించారు. లైట్లు మంద్రంగా వెలుగుతున్నాయి. రాఘవయ్యగారు మంచంమీద అటు ఇటూ దొర్లుతున్నారు. ఆయనకు నిద్రపట్టడం లేదల్లే వుంది.

''అనవసరమైన ఆలోచనలతో బాధపడకండి'' అన్నాను ధైర్యం చెబుతూ.

రాఘవయ్యగారు నావైపు చూస్తూ –

''నేనెటువంటి దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నానో నీకు తెలియదు బాబూ. మొదటిసారిగా నా ఇంట్లో కోడలిగా అడుగుపెట్టిన మంజులకి ఇప్పటి మంజులకి భూమికి ఆకాశానికి వున్నంత తేడా వుంది. 'మీలాంటి అత్తమామలు లభించడం నా అదృష్టం' అంటూ ఆనాడు మా కాళ్లకి మొక్కిన మంజులకు ఈనాడు మా పొడే గిట్టడం లేదు. మేము ఒక భారంగా తోచాం. అదృష్టవంతురాలు నా భార్య వెళ్లిపోయింది. నేనే మిగిలాను చీదరింపులూ తిరస్కారాలు పడటానికి. నా కొడుకు శేఖర్ పెళ్లాం చేతిలో కీలుబొమ్మగా తయారయ్యాడు. కాలంతోపాటు మనిషి కూడా ఎంత త్వరగా మారిపోతాడో అనడానికి మా కొడుకు కోడలు మంచి ఉదాహరణలు'' అన్నారు. ఆ మాటలంటున్నప్పుడు ఆయన కంఠం కొంచెంగా వణికింది.


కాస్మటిక్ దంత వైద్యం

చికిత్సకు ముందు



"చూశారా! పై ఫోటోలో పళ్ళ మధ్య ఇంతేసి సంధులతో ఎంత వికారంగా ఉన్నానో! అసలు నవ్వేవాడినే కాదు! అందుకే స్మైల్ డిజైనింగ్ చేయించుకున్నా. క్రింది ఫోటోలో చూడండి ఎంత స్మార్ట్‌గా తయారయ్యానో!! ఇప్పుడు ప్రతి చిన్న విషయానికి నోరు తెరచి పగలబడి నవ్వుతున్నా!

చికిత్సకు తరువాత



స్పెషలిస్ట్ కామెంట్....

★ పళ్ళ మధ్య సంధులుంటే ఎవరైనా వారి వయసు కంటే ఎక్కువ వయసున్న వారిలా కనిపిస్తారు.
★ ఎత్తు పళ్ళు వచ్చినట్లుగా కనిపిస్తుంది. పై పెదవి ఆకారం మారిపోయి పైకొచ్చినట్లుంటుంది.
★ వీరిలో ఇన్ఫీరియారిటీ ఫీలింగ్ ఉంటుందని మానసిక వైద్యులంటారు.
★ పళ్ళు మధ్య సంధులు మొదలవుతున్నప్పుడే గమనించి స్పెషలిస్టును కలవాలి.
★ సంధులు చిన్నవైనా, పెద్దవైనా సరిచేసి మీ కోసం అందమైన చిరునవ్వుని డిజైన్ చేయగల టెక్నాలజీ, స్పెషలిస్టులు మా వద్ద ఉన్నారు.

పార్థ దంతవైద్యశాల & రీసర్చి సెంటర్

స్కైల్ స్పెక్ట్రం కాంప్లెక్స్, టి.టి.డి. కళ్యాణ మండపం ప్రక్కన, లిబర్టీ సెంటర్, హిమాయత్ నగర్, హైదరాబాదు. ఫోన్:040-55991010, 23222200

ఆర్.టి.సి. బస్టాండ్ వెనుక, శ్రీనివాసం కాంప్లెక్స్ ఎదురుగా, పెద్దకాపు లేఔట్, తిరుపతి ఫోన్:0877-2250555, 2250105

''ఆఖరిసారిగా చెబుతున్నాను. ఈసారయినా నా మాట వినండి. ఈయనని ఇప్పటికైనా వదిలించుకుందాం. ఈయన ఆరోగ్యం కుదుటపడింది. ఎక్కడో అక్కడ కాలం వెళ్లదీస్తారు. ఇహ ఈ భారం మనకొద్దు. మనం వెళ్లిపోదాం'' శేఖర్ వైపు తీవ్రంగా చూస్తూ అంది మంజుల. ఆ చూపు కరడు గట్టిన కఠినత్వానికీ, నిర్దయకు ప్రతిరూపంలా వుంది.

రాఘవయ్యగారికి నిద్రపట్టకపోవడానికి ఆయన పడుతున్న మానసిక బాధ కారణమని అర్థమైపోయింది. నర్సుని పిలిచి డాక్టరు గారికి కబురు చేశాను.

డాక్టరు గారు వెంటనే వచ్చారు. రాఘవయ్య గారిని పరీక్షించి ''రాఘవయ్యగారూ! ప్రశాంతంగా నిద్రపొండి. మీకేం లోటు. మీ కొడుకూ కోడలూ దగ్గరే వున్నారు'' అని, నావైపు చూస్తూ ''మిమ్మల్ని ఎక్కువగా అభిమానించే మూర్తిగారు కూడా ఇక్కడే వున్నారు. ప్రస్తుతం మాత్రలు పంపిస్తాను. వేసుకోండి. శరీరానికి మనస్సుకి విశ్రాంతి అవసరం'' అంటూ నర్సుకి ఏదో సైగలాంటిది చేసి వెళ్లిపోయారు.

రాఘవయ్యగారు నిద్రపోవటం లేదని కోడలు మంజుల విసుక్కుంటోంది. ''ఈ ముసలాయన నిద్రపోడు. మనల్ని నిద్రపోనివ్వడు'' అంటూ గొణుక్కుంది. తర్వాత నర్సు ఏవో మాత్రలు తీసుకొచ్చి రాఘవయ్య గారికిచ్చింది. కొంతసేపటికి రాఘవయ్య గారికి నిద్రపట్టింది.

వారం రోజులు గడిచాయి. అనుకున్నట్టుగానే డాక్టరు గారు వచ్చి ''ఈయన ఆరోగ్యం కుదుటపడింది. ఇక మీరు ఇంటికి తీసుకెళ్లొచ్చు'' అని చెప్పి వెళ్లిపోయారు. ఆ సమయంలో రాఘవయ్యగారు నిద్రపోతున్నారు.

''ఆఖరిసారిగా చెబుతున్నాను. ఈసారయినా నా మాట వినండి. ఈయనని ఇప్పటికైనా వదిలించుకుందాం. ఈయన ఆరోగ్యం కుదుటపడింది. ఎక్కడో అక్కడ కాలం వెళ్లదీస్తారు. ఇహ ఈ భారం మనకొద్దు. మనం వెళ్లిపోదాం'' శేఖర్ వైపు తీవ్రంగా చూస్తూ అంది మంజుల. ఆ చూపు కరడుగట్టిన కఠినత్వానికీ, నిర్దయకు ప్రతిరూపంలా వుంది.

''ఏంటి ఆ మాటలు. నెమ్మదిగా మాట్లాడు. నాన్నగారు వింటారు'' అన్నాడు శేఖర్.

''వింటే విన్నారు. అయితే ఏంటి. నేనేది అనుకుంటే అదే జరుగుతుంది. అయినా ఇంత వయసు వచ్చినా ఇంకా అమ్మకూచిలా తండ్రిని వదులుకోలేకపోతున్నారు'' కసురుతున్నట్టుగా అంది మంజుల.

నాకు మతిపోయినంత పనయ్యింది ఆవిడ మాట్లాడుతున్న మాటలకి. నేను ఉండబట్టలేక –

''మంజుల గారూ మీరేమీ అనుకోనంటే ఓ విషయం చెప్తాను.మీరు చేస్తున్న ఆలోచన మంచిది కదా. ఇంట్లో పెద్దవాళ్లయిన తల్లిదండ్రులకి బిడ్డల ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు ముఖ్యం. వారి డబ్బు కాదు. ఈ పరిస్థితులలో రాఘవయ్య గారిని విడిచి వెళ్లడం మీకు ధర్మంకాదు'' అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశాను. ఆవిడకి నా మాటలు రుచించినట్లు లేదు. నావైపు కోపంగా చూసింది. ఆ చూపు నన్ను కలవరపెట్టింది. అయినా ఆమె నన్ను లెక్కచేయకుండా భర్త చెయ్యి పట్టుకుని –

''హాస్పిటల్ బిల్లు కట్టేశారుగా. ఇక చాలు పదండి. మీ నాన్నగారు బాగానే కోలుకున్నారు. ఇక ముందు ఎక్కడికెళ్లాలో ఎక్కడ వుండాలో ఆయనే తేల్చుకుంటారు. ఇహ ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవద్దు. పదండి'' అంటూ ముందుకు దారితీసింది. నేను అయోమయంగా చూస్తూ అక్కడే ఉండిపోయాను.

శేఖర్, మంజుల కొంచెం ముందుకెళ్లిన తర్వాత నర్సుని పిలిచి ''చూడు సిస్టర్, వీళ్లని బండి ఎక్కించి వస్తాను. నేను వచ్చేంతవరకు రాఘవయ్య గారిని కాస్త కనిపెట్టుకుని వుండు'' అని చెప్పి నేను కూడా శేఖర్‌ని అనుసరించాను.

శేఖర్‌కి సెండాఫ్ ఇచ్చినప్పుడు అతని ముఖంలో ఎలాంటి ఎక్స్‌ప్రెషన్ లేకపోవడం నాకు ఆశ్చర్యమనిపించింది. నా హృదయాంతరాళంలో ఏదో బాధ గూడుకట్టుకోసాగింది. ఈ లోకంలో ఎందరో వృద్ధులు పరిస్థితులకు తలొగ్గి రాజీపడి బ్రతుకుతున్నారు. తమ సంతానం చేత తిరస్కారానికి గురవుతూ సమాజంలో చిన్నచూపు చూడబడుతున్నారు. కన్నవారి అనాదరణను, నిర్లక్ష్యాన్ని భరిస్తూ బ్రతకడం వారికి దుర్భరమవుతోంది. అయినా తప్పడంలేదు. రేపటిరోజు నా పరిస్థితీ ఇంతేనా?... ఆలోచించలేకపోయాను. ఆలోచనలతో సతమతమవుతూ హాస్పిటల్‌కి చేరుకునే సరికి రాత్రి పదకొండయ్యింది. రాఘవయ్య గారు వార్డు బయట బల్లమీద కూర్చుని వున్నారు. డాక్టరు గారితో ఏదో మాట్లాడుతున్నారు. నన్ను చూడ్డంతోటే దుఃఖం ఆపుకునే ప్రయత్నం చేస్తూ 'బాబూ వాళ్లని జాగ్రత్తగా బండి ఎక్కించావా' అని అడిగారు.

నేను ఆశ్చర్యపోతూ – ''వాళ్లు మిమ్మల్ని పట్టించుకోకపోయినా మీరు వాళ్ల జాగ్రత్తగురించే ఆలోచిస్తున్నారా?...'' అంటుండగానే నా మటల్ని మధ్యలోనే తుంచేస్తూ ''అదేంటి బాబూ అలా అంటావు. బిడ్డలు ఆదరించకపోయినా, నిర్దాక్షిణ్యంగా ఇక్కట్లపాలు చేసినా తల్లిదండ్రులు బిడ్డల క్షేమాన్నే కోరుకుంటారు'' అన్నారు రాఘవయ్యగారు. కన్నప్రేమ అంటే అదేననిపించి నా కళ్లు చెమ్మగిల్లాయి. కొంతసేపు మౌనం తర్వాత రాఘవయ్య గారు దీర్ఘంగా నిశ్వసిస్తూ –

''ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పదిలంగా వున్న వెనకటి రోజులలో ఒకరిపై మరొకరికి ఆప్యాయతలు, మమతలు పరిమళించేవి. ఎవరికి వారు తమ పరిమితుల్ని, బాధ్యతల్ని తెలుసుకుని మెసిలేవారు. వృద్ధులను ఇంటికి పెద్దదిక్కుగా భావించేవారు. కొడుకులు తల్లిదండ్రులను,కోడళ్లు అత్తమామలను గౌరవించేవారు, ప్రేమించేవారు. ఆ వాతావరణంలో వృద్ధులు చీకూచింతా లేకుండా హాయిగా సంతోషంగా వుండేవారు. ఆర్థికపరమైన సమస్యలున్నా కలిసికట్టుగా వాటిని పరిష్కరించే ప్రయత్నం చేసేవారు కాబట్టి అంతగా బాధ వుండేది కాదు. కాని రోజులు మారిపోయాయి. ఆ పరిస్థితులు ఇప్పుడు లేవు. నా గతం నీకు తెలియందేమీ కాదు. ప్రేమ, అనురాగం లేని చోట ఆత్మాభిమానానికి విలువలేదు. ఇప్పుడు నా జీవితం ఒక మలుపు తిరిగింది. ఒక ముఖ్యమైన అధ్యాయం ముగిసింది... అంతే! ఈవారం రోజులు నా కొడుకుకన్నా ఎక్కువగా అభిమానించావు. నువ్వు నీ భార్యాపిల్లలతో కలకాలం సుఖంగా వుండాలి. ఇక నాకు సెలవు. వుంటాను బాబూ–'' అని బట్టలు సర్దుకోసాగారు రాఘవయ్య గారు.

''ఎక్కడికి వెళ్తారు?'' అని అడిగాను.

దానికాయన సమాధానంగా ''చుక్కాని లేని నావని గమ్యమేటు అని అడిగితే ఏం చెబుతుంది? నేనూ అంతే'' అన్నారు.

''మీరు ఎక్కడికి వెళ్లొద్దు. నా దగ్గరే, నాతోపాటే వుండండి'' అన్నాను.

''ఏంటి బాబూ నువ్వంటున్నది. నేను... మీ ఇంట్లోనా'' అన్నారు రాఘవయ్యగారు ఆశ్చర్యంగా.

''అవును. మీరు మా దగ్గరే వుండండి. ఊరికే ఉండటం ఇష్టం లేకపోతే మా పిల్లలకి ట్యూషన్స్ చెప్పండి. అంతేకాదు, మా కాలనీలో డెబ్బై అయిదు ఇళ్లున్నాయి. పిల్లల్ని కూడగట్టడం పెద్ద విషయమేం కాదు. వాళ్లందరికీ మీచేత ట్యూషన్లు చెప్పించే ఏర్పాటు చేస్తాను. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకి బోధించండి. తీరిక సమయాల్లో వాతావరణం కలుషితం కాకుండా పచ్చదనం అవసరం ఎంతైనా వుందనే వాస్తవాన్ని కాలనీలో ప్రచారం చేయండి. పిల్లలందరిచేత మొక్కలు నాటించే ప్రక్రియ చేపట్టండి. మా కాలనీని ఓ నందనవనంలా మార్చడానికి సహకరించండి. మా కాలనీ వాసులందరికీ చెప్పి మీకు ఆర్థికంగా ఇబ్బంది లేకుండా నేను ఏర్పాటు చేస్తాను.'' అన్నాను.

''బాబూ నీ మాటలు వింటుంటే కొడుకు కోడలి తిరస్కారానికి గురైన నేను బతికేదెలా అన్న గుండెలోని భారం ఒక్కసారిగా దిగిపోయినట్టుగు వుంది. అడుగు తీసి అడుగువేయటానికి కంపించిన నా పాదాలకు బలం వచ్చినట్టుగా వుంది. నాలో జీవించాలన్న ఆశ చిగురింపజేశావు. నీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు'' అంటూ ఆనంద భాష్పాలు జాలువారుతుండగా నన్ను అనుసరించారు రాఘవయ్యగారు. మధ్యలో ఆగి –

''అది సరే. నువ్వు ఈవిధంగా ఎందుకు చేస్తున్నట్టు?'' అని అడిగారు రాఘవయ్యగారు.

''ఎందుకంటే రేపటి నా వృద్ధాప్యం నాకు వరంగా పరిణమించాలనీ, మీనుంచీ నానుంచీ ఈ కాలపు పిల్లలు తగిన పాఠాలు నేర్చుకోవాలనీ...'' అన్నాను.

★